
www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 5 మార్చి 2023

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్‌పి



ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో జరిగే ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి సిహెచ్ విజయరావు హెచ్చరించారు. శనివారం నగరంలోని ఎస్‌పి కార్యాలయంలో ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి పోలీసు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగ పరంగా లభించిన ఓటు హక్కును అర్హత కలిగిన ప్రతి ఒక్కరు నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పరిధిలో వచ్చే పోలింగ్ ప్రాంతాల గురించి, తీసుకునే ప్రణాళికలు గురించి, సున్నిత, సాధారణ పోలింగ్ కేంద్రాల గురించి, ఇప్పటి వరకు ఎన్నికలకు తీసుకున్న చర్యల గురించి, పోలింగ్ రోజున చేపట్టే పోలీసు బందోబస్తు, తదితర అంశాలను క్షుణ్ణంగా చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశామన్నారు. ఇప్పటి వరకు బైండోవర్ చేసిన వ్యక్తుల వివరాలు, ఆయుధాలను ప్రతి ఒక్కరూ తప్పక డిపాజిట్ చేయాలని, ఎన్‌బిడబ్ల్యూ పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. గత ఎన్నికలలో నమోదు అయినా కేసుల వివరాలను తెలుసుకొని, పునరావృతం కాకుండా కఠినంగా, అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశామన్నారు.

పేదల సొమ్ము.. తలా పిడికెడు..!

◆వెయ్యి మంది సభ్యుల భాగస్వామ్యం

◆11మంది పాలకవర్గ సూత్రధారులు

◆రికవరీ దిశగా అధికారుల కసరత్తులు

ఇందుకూరుపేట మండలం, కొత్తూరు మహిళా సహకార బ్యాంక్‌లో జరిగిన అవినీతిలో పేదల సొమ్మును తలా పిడికెడు మింగేశారు. బ్యాంక్‌లోని వెయ్యి మంది సభ్యులు ఇక్కడ రుణాలు తీసుకొని చెల్లించకుండా దాగుడుమూతలు ఆడుతున్నారు. బ్యాంక్‌ను సక్రమ మార్గంలో నడిపించాల్సిన పాలకవర్గం సూత్రధారులు వ్యవహరించారు. అవినీతి జరిగిన సొమ్మును రాబట్టడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడాది క్రితం బయటకొచ్చిన ఈ కుంభకోణం, ఒకటన్నర నెల నుంచి విచారణ సాగుతోంది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ బ్యాంక్ లావాదేవీలను దెబ్బతీస్తున్నారు. ఇప్పటి వరకు ఇందులో పాత సభ్యుల పాత్ర రూ.1.50 కోట్లు, కొత్తగా రూ.2 కోట్లు అవినీతి జరిగినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. రికవరీ చేసి, బ్యాంక్‌ను గాడిలో పెడతారా ? రాజకీయ ఒత్తిళ్లకు లొంగి అధికారులు చేతులెత్తేస్తారా చూడాల్సి ఉంది.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఇందుకూరుపేట మహిళా బ్యాంక్‌లో జరిగిన అవినీతి గురించి అంతా చర్చసాగుతోంది. ఇన్నేళ్లపాటు ఇంత మొత్తంలో తినేస్తుంటే అక్కడ పనిచేసే అధికారులు, పాలవర్గం ఏం చేస్తుందనే సందేహం అందరిలో వస్తుంది. ఈ అవినీతిలో అందరి వాట కనిపిస్తోంది. అధికారులు పాత్ర కీలంకగా ఉన్నట్లు విచారణ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. జిల్లాలో సహకారం రంగంలో నడుస్తోన్న బ్యాంకుల్లో ఇందుకూరుపేట బ్యాంక్‌కు మంచి పేరుంది. 1998లో 500 గ్రూపులతో ఈ బ్యాంక్ నిర్మాణం జరిగింది. ప్రతి గ్రూపులో పది మంది చొప్పున ఐదు వేల మంది సభ్యులుండేవారు. కాలక్రమంలో సభ్యులు సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం అధికారిక లెక్కల ప్రకారం 100 గ్రూపుల్లో వెయ్యి మంది వరకు సభ్యులున్నారు. ఎప్పటి నుంచో ఇక్కడ మహిళా సభ్యులు బ్యాంక్ నుంచి రుణం తీసుకోవడం చెల్లించడం జరుగుతోంది. డైరెక్టర్లు నేరుగా సభ్యుల వద్దకు వెళ్లడం డబ్బులు తీసుకొచ్చి బ్యాంక్‌లో చెల్లించి, తరువాత స్థానిక బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తారు. కరోనా ముందు వరకు సక్రమంగా నడిచినా కరోనా సమయంలో సభ్యులు రుణం చెల్లించకపోవడం. డైరెక్టర్లు తీసుకున్న సొమ్ము బ్యాంక్‌కు కట్టకపోవడం జరిగింది. వచ్చిన డబ్బును తీసుకెళ్లి సొంత అవసరాలు ఉపయోగించుకున్నట్లు తెలుస్తోంది. మళ్లీ చెల్లిద్దాం అనుకొని చివరికి ఇలా తయారుచేశారు. ఇదే సమయంలో కొందరు డైరెక్టర్లు నకిలీ గ్రూపులు సృష్టించి సభ్యుల పేరుతో దోపిడీకి పాల్పడ్డారు. ప్రస్తుతం ఐదు కోట్ల రూపా యల వ్యాపార, లావాదేవీలతో ఉంది. బ్యాంక్ సక్రమంగా నిర్వహించేందుకు 11 మంది డైరెక్టర్లు ఎన్నికయ్యారు. ఇందులో ఇక్కడ పనిచేసే మేనేజర్ ఎస్‌కె. హసీనా నాలుగు నకిలీ గ్రూపులు సృష్టించి రూ.25 లక్షలు, క్యాషియర్ ఎస్‌డి రమేజా ఆరు గ్రూపులు సృష్టించి రూ.18 లక్షలు, డైరెక్టర్ అన్నపూర్ణమ్మ 11 గ్రూపులు సృష్టించి భారీగా నగదు దిగమింగినట్లు తెలుస్తోంది. ఇందులో నకిలీ గ్రూపు సృష్టించి కొంత, మహిళలు



బ్యాంక్‌లకు చెల్లించిన నగదు చెల్లించకుండా ఇంకొంత అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. సహకారశాఖ అధికారులు వేగవంతంగా విచారణ చేపట్టారు. తవ్వేకొద్ది అవినీతి అక్రమాలు బయట పడుతున్నాయి. రికార్డులు లేకుండా కేవలం చిత్తుకాగితాలపై కాకిలెక్కలు తయారుచేశారు. విచారణ అధికారులకు రికార్డులు దొరకడం లేదు. ఏ పద్దు ఎప్పుడు, ఎక్కడుందో తెలుసుకోడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఉద్యోగుల తొలగింపు..!

ఇందుకూరుపేట మహిళా బ్యాంక్‌లో ఇప్పటి వరకు జరిగిన విచారణలో సుమారు రూ.3.50 కోట్లు అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుత పాలక వర్గం రూ.2 కోట్లు, పాత వారు రూ.1.50 కోట్లు అవినీతికి పాల్పడినట్లు సమాచారం. సభ్యులు, డైరెక్టర్లు తప్పుచేస్తే బ్యాంక్‌లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది సరిచేయాల్సి ఉంటుంది. ఇక్కడ అందరూ కలిసి అవినీతికి తెరలేపారు. బ్యాంక్ సిబ్బంది మేనేజర్ ఎస్‌కె. హసీనా, క్యాషియర్ ఎస్‌డి రమేజా పాత్ర కీలకంగా ఉన్నట్లు గుర్తించారు. అధికారులు వీరిద్దరిని తొలగించి కొత్త సిబ్బందిని నియమించారు. పాలకసభ్యులు ఇప్పటికే భారీ మొత్తంలో అవినీతికి పాల్పడగా వారిని రికవరీ చేయించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. తిరిగి చెల్లిచకపోగా మేమే కాదు అందరూ తిన్నారంటూ తిరగబడుతున్నారు. రికవరీ చేయకపోగా నువ్వంటే, నువ్వంటూ విమర్శలు చేసుకుంటున్నారు. విచారణ అధికారులు వేగంగా చేస్తున్నారు. మొత్తం బయటకొచ్చిన తరువాత క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. సొమ్ము రికవరీతోపాటు జైలు శిక్ష పడనుంది. ఈ కేసు నుంచి ఎలా బయటపడాలనే విషయంపై బాగస్వామ్యులైన సభ్యులు, సూత్రధారులైన డైరెక్టర్లు మదనపడుతున్నారు. కొందరు సభ్యులు సొమ్ము చెల్లించామంటూ గగ్గోలు పెడతున్నారు. ఇందుకు సంబంధించిన రికార్డు కనిపించడం లేదు. పేదల సొమ్ము కాజేసిన వారికి సరైన శిక్షపడితే మరొకరు తప్పుచేయడానికి బయపడుతారని గ్రామస్తులు అంటున్నారు. ఏం జరుగుతుందో చూడాలి.



ఉద్యోగులతో చర్చిస్తున్న కమిషనర్

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ కార్యదర్శులు తమకు నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను అందుకోవాలని కమిషనర్ హరిత సూచించారు. స్థానిక 38/1 అక్కన్న వారి వీధి వార్డు సచివాలయాన్ని కమిషనర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని వివిధ రికార్డులను పరిశీలించారు. ఆస్థి పన్ను, యూజర్ చార్జీల వసూళ్ళను సచివాలయ కార్యదర్శులు మరింత వేగవంతం చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వే పనులను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. సచివాలయం పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించాలని, రానున్న వేసవి నీటి ఎద్దడిని దష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.



అనుచరులుద్దేశించి మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీధర్‌రెడ్డి

త్వరలో ఆత్మీయ సమావేశం : శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు : మరో వారంలో మహాత్మా గాంధీ నగర్ లో పెద్ద ఎత్తున ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఇందులో స్థానికులను భాగస్వాములు చేయాలని రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆ ప్రాంత కార్యకర్తలకు సూచించారు. శనివారం రూరల్ ఎంఎల్ఎ కార్యాలయంలో 29వ డివిజన్‌కు సంభంధించిన తన అనుచరగణంతో, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్ట కాలంలో తన వెంట నడుస్తున్న ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. ఒకరిద్దరు వెళ్లిపోయిన వారి స్థానంలో నూతన నాయకత్వాన్ని తయారు చేస్తామన్నారు. 29వ డివిజన్ ప్రజలకు సంబంధించి ఏ అవసరం వచ్చిన తమ దష్టికి తీసుకు రావాలన్నారు. కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు 24 గంటలు అందు బాటులో ఉన్నమని రెట్టించిన ఉత్సాహంతో ఈ డివిజన్లో నేతలు కార్యకర్తలు పని చేయాలని కోరారు. 29వ డివిజన్ కు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిస్థితులు, గెలుపు వ్యూహాలు, తదితర అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి..!

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక 30 వ డివిజన్ కొత్తూరు అరుంధతి ప్రాంతంలో పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డికి, టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి పోక్కిరెడ్డి బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు కండె కోటేశ్వరరావు, మాజీ సర్పంచి కండె శ్రీనివాసులు శాఖ కార్యదర్శి ఖయ్యూం, పొత్తూరు రమణయ్య, నరికె దశయ్య తదితరులు పాల్గొన్నారు. స్థానిక 27. వ డివిజన్ చంద్రమౌళి నగర్ ప్రాంతంలో సిఐటియు రూరల్ అధ్యక్షులు.కొండాప్రసాద్. పార్టీసభ్యులు కష్ణమూర్తి. సిఐటి యు కార్యకర్తలు వి. వెంకటేశ్వర్లు ,డి. రామకృష్ణారెడ్డి పి. వెంకట్ రెడ్డి. సిహెచ్ . మాలాద్రి. భవన నిర్మాణ కార్మిక సంఘంజిల్లా ఉపాధ్యక్షులు వై. రంగయ్య. తదితరులు పాల్గొన్నారు. 26వ డివిజన్ నందు సిపిఎం శాఖ ఆధ్వర్యంలో సి.పి.ఎం రూరల్ కమిటీ సభ్యులు దేవతాటి సంపత్ కుమార్, శాఖ కార్యదర్శి ఎస్‌కె. కాలేషా, పులిమి నరసిం హారెడ్డి,ఎస్‌కె. చాంద్ భాషా, ఎస్ఆర్. అల్తాఫ్, సిహెచ్. కష్ణ, బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వైఎస్ఆర్ నగర్ ప్రాంతంలో సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు కండె కోటేశ్వరరావు, వాసుదేవరావు, ప్రకాష్ రమేష్, షాహుల్, భాష, కరిముల్లా, రాంబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరులో



నెల్లూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

కందుకూరు :మార్చి 13న జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సిఐటియు ఆధ్వ ర్యంలో శనివారం ప్రచారం చేశారు. ఉపా ధ్యాయ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పొక్కిరెడ్డి బాబురెడ్డికి, పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిలను గెలిపించాలని కోరుతూ పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు జివిబికుమార్ నేతృత్వంలో ఈ ప్రచారం జరిగింది.



కందుకూరులో..

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి : సిపిఎం



తోటపల్లిగూడూరు :ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య పేర్కొన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ, సిఐటియుల ఆధ్వర్యాన శనివారం తోటపల్లిగూడూరు మండలం నరుకూరులో నిరసన జరిగింది.వెంకయ్య మాట్లాడుతూ కేంద్రం పెంచిన గ్యాస్ ధరలు పేద ప్రజల నడ్డి విరిచేలా ఉన్నాయని ద్వాజత్తారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కేవలం రూ. 414 ఉన్న రూ. 1150 చేరిందన్నారు. రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులు జయమ్మ, బుజ్జమ్మ, పాకం , ఆటో యూని యన్ అధ్యక్షులు నాశన, పరశురామయ్య, వెంకట శేషయ్య, బాషా పాల్గొన్నారు.

బాలికలకు ఉపకార వేతనాలు


ప్రజాశక్తి -పొదలకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభ కలిగిన బాలికలకు కోరమాండల్ బాలికా విద్యా పథకం ద్వారా పొదలకూరులో ఉపకార వేతనాలు ఇవ్వనున్నారు. నేడు జరిగే సమావేశంలో ఉపకార వేతనాలను కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ అందిం చనుంది. జి సుబ్బారెడ్డి, పి భాస్కర్ రెడ్డి, నెల్లూరు జోనల్ మేనేజర్ ఎల్ జె ఎస్ మాధవన్ లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని ద్వారకామాయి ఫంక్షన్ హాల్ లో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది

'శివసాయి'లో వీడ్కోలు



ప్రజాశక్తి -కందుకూరు : పట్టణంలోని శ్రీ శివసాయి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈవేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ ఓరుగంటి శివరామయ్య, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశ్రాంత ఎంఇఒ రాంబాబు మాట్లాడారు. విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఈత కొలను పున:ప్రారంభం



ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరులోని ఉప్పు చెరువు వద్ద నున్న పురపాలక సంఘ స్విమ్మింగ్ పూల్‌ను పునః ప్రారంభించినట్లు కమిషనర్ ఎస్ మనోహర్ తెలిపారు. పట్టణ ప్రజలు వేసవిలో వ్యాయామం. వినోదం కోసం ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

మాల్యాద్రి చౌదరికి నివాళి

ప్రజాశక్తి -కందుకూరు :పామూరులో గుండెపోటుతో మృతిచెందిన టిడిపి సీనియర్ నాయకులు బొల్లా మాల్యాద్రి చౌదరికి కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు నివాళి అర్పించారు. శనివారం మాల్యాద్రి చౌదరి భౌతిక ఖాయాన్ని ఇంటూరి సందర్శించి నివాళి అర్పించారు. ఇంకా నివాళి అర్పించినవారిలో ఎంఎల్‌సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు చిట్టిబోయిన చిట్టిబాబు ఉన్నారు.



నివాళి అర్పిస్తున్న ఇంటూరి

విరాళం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : అంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం కోసం ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం జరుగుతోంది. భక్తులు తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు. శనివారం మానుగుంట మహీధర్ రెడ్డి సమక్షంలో డాక్టర్ శ్రీకాంత్ వెంకటేశ్వర షుగర్ హాస్పిటల్ కందుకూరు వారు ఆలయాన్ని సందర్శించి తన వంతుగా రూ.10,116లు విరాళంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు యెనిమి రెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు. లాయర్ కిషోర్ పాల్గొన్నారు.

అదనపు ఎస్‌పికి సన్మానం

ప్రజాశక్తి -కందుకూరు :

అడిషనల్ ఎస్‌పి (ఎస్ఇబి) శ్రీలక్ష్మి బదిలీపై జిల్లా నుంచి వెళ్తున్న నేపథ్యంలో ఆమెకు శనివారం సన్మానం జరిగింది. కందుకూరు డిఎస్‌పి కండె శ్రీనివాసులు, కందుకూరు సిఐ జి వెంకట్రావు, గుడ్లూరు సిఐ సుబ్బారావు పాల్గొన్నారు.



'లైన్‌మెన్' దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యుత్ భవన్ లోని స్కాడా బిల్డింగ్ లో లైన్ మెన్ దినోత్సవ వేడుకల ను అట్టహాసంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా నగర ఏఈ ఏ. సోమశేఖర్ రెడ్డి , పర్యవేక్షణా ఇంజనీర్ బి. వెంకట సుబ్బయ్యలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ కు ఓఅండ్ ఎమ్(ఆపరేషన్ అండ్ మెయింటెన్స్) సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారన్నారు. ప్రతి సంవత్సరం జాతీయ భద్రతా వారోత్సవాలలో భాగంగా మొదటి రోజు మార్చి 4వ తేదీన లైన్ మెన్ దినోత్సవంగా పరిగణిస్తు న్నారన్నారు. విద్యుత్ సిబ్బంది ఉద్యోగం చాల జాగ్రత్తగా చేయాలని ప్రమాదాలు నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఒక బ్రేక్ డౌన్ వచ్చింది అందరూ కలిసికట్టుగా పనిచేస్తే మంచి ఫలితాలు సొంతం చేసుకోవచ్చున్నారు. ఉద్యోగి తన విధుల పట్ల అంకితభావంతో వ్యవహరిస్తే వారి కుటుంబ వ్యవస్థ కూడ చక్కగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యుత్ సిబ్బంది ఫ్రంట్ లైన్ వారియర్స్ అని తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ డివిజన్ లోని 11 సెక్షన్ లలో ఒక్కొక సెక్షన్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఒకరికి ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. ఏ.కె.నగర్ సెక్షన్ నుండి బి.జగదీష్, బి.వి.నగర్ సెక్షన్ నుండి ఐ. వి.రెడ్డి, ఐ.ఈ. సెక్షన్ నుండి పెంచల కిరణ్ ,టౌన్ హాల్ సెక్షన్ నుండి ఎన్ హరి , ఈస్ట్-1 సెక్షన్ నుంచి ఎం సునీల్ కుమార్, ఈస్ట్-2 సెక్షన్ నుంచి వి.వి. సుబ్బారావు గారు , స్టోన్ హౌస్ పేట సెక్షన్ నుంచి షేక్ లతీఫ్, హరినాధపురం సెక్షన్ నుంచి ఏడుకొండలు , వెస్ట్-1సెక్షన్ నుండి డి నాగరాజు ,వెస్ట్ -2 సెక్షన్ నుంచి ఎస్ శ్రీనివాసులు, వెస్ట్-3 సెక్షన్ నుంచి షేక్. మస్తాన్ లకు ఉత్తమ సేవా పుష్కరాలు అందుకున్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇం జనీర్స్ శ్రీధర్, మధుసూదనరెడ్డి , కిరణ్ డివిజ న్లోని అసిస్టెంట్ ఇంజనీర్స్,సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు మేలు : కాకాణి

ప్రజాశక్తి -పొదలకూరు

వైసిపి ప్రభుత్వంలో రైతులకు మేలు జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అమ్మవారిపాలెం గ్రామంలో శనివారం సాయంత్రం ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. సోమిరెడ్డి ఒక్కరే బాధపడుతున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కన్నా, ఎక్కువ ధరలు పలుకుతు న్నాయన్నారు. దాన్ని జీర్ణించుకోలేక సోమిరెడ్డి రకరకాలుగా మాట్లాడుతున్నారన్నారు.గ్రామానికి వచ్చిన మంత్రికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. మండల ప్రజా ప్రతినిధులు, వైకాపా నాయకులు గొగిరెడ్డి గోపాల్ రెడ్డి, మనోహర్ నాయుడు, కోదండయ్య, ధనుంజయ, బి. నరసింహులు నాయుడు అమ్మవారిపాలెం సర్పంచ్ ఝాన్సీ, నేదురుపల్లి సర్పంచ్ ఉడత రమేష్ యాదవ్ పాల్గొన్నారు.



డిఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సైదాపురం :స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఎం. పెంచలయ్య శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆసుపత్రి పరిధిలోని గర్భిణులు, ప్రసవాల వివరాలను అడిగి తెలుసు కున్నారు. గర్భిణులకు అందచేస్తున్న వివరాలను తెలుసుకున్నారు. అరుంధతీ వాడలోని అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించి, గర్భిణులకు అందచేస్తున్న పౌష్టికాహార వివరాలు, ఎంత మందికి అందజేస్తుండే వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్యాధి కారి జనార్ధన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఎంఎల్‌సి అభ్యర్థి విజయం కోరుతూ ప్రచారం

రాపూరు : మండలంలోని గోనుపల్లి పంచాయతీలో టిడిపి పట్టభద్రుల ఎంఎల్ సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌ను గెలిపించాలని కోరుతూ టిడిపి నాయకులు ప్రచారం చేపట్టారు. కండె రమణయ్య, నూతలపాటి దామోదర నాయుడు పాల్గొన్నారు.

పజాశక్తి -కందుకూరు :కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరావు పట్టణంలోని వివిధ విద్యా సంస్థల్లో ఎంఎల్‌సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ గెలుపు కోరుతూ శనివారం ప్రచారం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు చిట్టిబోయిన చిట్టిబాబు ఉన్నారు.

ఉలవపాడు : మండలంలోని వీరేపల్లి, చాగొల్లు గ్రామాల్లో టిడిపి నేతలు టిడిపి ఎంఎల్‌సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ విజయం కోరుతూ ప్రచారం చేపట్టారు. క్లస్టర్ ఇంచార్జ్ పోలుబోయిన శ్రీనివాసులు, బెల్లం కష్ణమోహన్, యూనిట్ ఇన్‌ఛార్జి రావిపాటి మహేశ్వరరావు ఉన్నారు.

వైసిపి అభ్యర్థి విజయం కోరుతూ...

ఉలవపాడు :ఉలవపాడులో వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డికి శనివారం ప్రచారం చేపట్టారు. సర్పంచి మాణికల నాగలక్ష్మి, ఎంపిటిసి ఫైజునిస్సా, మండల జెసిఎస్ కోఆర్డినేటర్ వెలిచర్ల ధనకోటి, వైసిపి పట్టణ అధ్యక్షుడు వేమిరెడ్డి కష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్స్ మహంకాళి భీమయ్య ప్రచారం చేశారు.



కాలనీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

జగనన్న కాలనీ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు :నవరత్నాలు పథకంలో భాగంగా పేదలందరికీ శాశ్వత గహ వసతి కల్పించే దిశగా రూపొందిస్తున్న జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేసి, పూర్తి చేసిన గహాలను ఉగాది నాటికి లబ్ధిదారులకు అందజేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. శనివారం "హౌసింగ్ డే" ను పురస్కరించుకుని స్థానిక వెంకటేశ్వరపురం భగత్ సింగ్ కాలనీ ప్రాంతంలోని జగనన్న కాలనీ నిర్మాణ పనులను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారుల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న గహాలలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు లే అవుట్ల నిర్మాణ పనులు, అభివద్ధి పనులను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు షేక్ జమీర్, హౌసింగ్ కార్పొరేషన్ డి.ఈ దయాకర్, అధికారులు, సచివాలయ వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు

కరేడు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి -ఉలవపాడు :మండలంలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పిన్ని మానస జాతీయస్థాయి అండర్ 14 స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువు తున్న మానస గత నెల 27వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు చిత్తూరు జిల్లా, నగరిలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం సాధించడంలో ప్రతిభ కనబరిచి ఆంధ్ర జట్టుకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఓగుబోయిన శ్రీనివాసులు చెప్పారు. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో మానసను, విద్యార్థిని తండ్రి పిన్ని వెంకటేశ్వర్లును పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బొడ్డు శ్రీధర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో పాల్గొన్న 15 మంది విద్యార్థులను అభినందించారు.



'సెబ్' అసిస్టెంట్ కమిషనర్‌గా శ్రీనివాసాచారి

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఆ స్థానంలో శ్రీనివాసాచారిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎస్ఈబి అసిస్టెంట్ కమిషనర్‌గా కె.శ్రీనివాసాచారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాద పూర్వకంగా ఎస్‌పి సిహెచ్ విజయరావును కలిశారు.



వెంకటయ్యకు ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కడనూతల గ్రామంలో ఉన్న వైసిపి నాయకులు వెంకటయ్యకు ఇటీవల అనారోగ్యంతో హాస్పిటల్లో ఉండి చికిత్స చేయించుకొని ఇంటికి వచ్చిన ఆయనను శనివారం ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ వెంకటయ్య పార్టీలో చురుగ్గా పనిచేసే వ్యక్తిని, ఆయన ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని, పార్టీ అండదండలు ప్రభుత్వ సహకారం ఎప్పుడూ ఆయనకు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కడనూతల గ్రామంలో ఎస్‌సి కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి, పాఠశాల అభివృద్ధి వసతులపై పాఠశాలప్రధాన ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జయకుమార్, ఉపాధ్యాయులు, వైసిపి కడనూతల నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.



పది విద్యార్థులకు అల్పాహారం

ప్రజాశక్తి-సీతారామపురం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళ శనివారం రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ సీతారామపురం బిట్-1 ఎంపిటిసి పిసి. అల్లూరురాజు, మాజీ వైస్ ఎంపిపి రామిశెట్టి తిరుపతయ్య విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని దాతలు ముందుకు రావడం ఎంతో శుభ పరిణామమని తెలిపారు. ఇటువంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పదవ తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పిడతల సుధాకర్, వాలంటీర్ పాలగిరి శివ, తదితరులు పాల్గొన్నారు.



దొంగలు హల్‌చల్

ప్రజాశక్తి-అల్లూరు

దొంగలు పోలీసుల కళ్లు గప్పి నానా బీభత్సం సృష్టించి వరుస దొంగతనాలకు పాల్పడడంతో బాధితులు బోరున విలపించారు. శుక్రవారం అర్ధరాత్రి మండల కేంద్రం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వెనక కూరగాయల అంగడిని పగలగొట్టి అందులో ఉన్న రూ.9వేల నగదు పోలేరమ్మ ఉత్సవానికి సంబంధించి ఆ యజమాని రోజువారీగా రూ.50 దాచి ఉంచే ఆ హుండీని దోచుకు వెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. అలాగే వాటర్ ట్యాంక్ సెంటర్‌లో ఇంతియాజ్, రమేష్ అనే వ్యక్తులు మోటార్ రీ వైండింగ్ షాపులలో షట్టర్లను కట్ చేసి పలు మోటార్లు, నగదును దోచుకు వెళ్లారు. ఎన్నడూ లేని విధంగా ఒకేరోజు 3 చోరీలు జరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. శనివారం యథావిధిగా షాపులను తెరిచేందుకు యజమానులు అక్కడ చేరుకోగానే ఈ సంఘటనను చూసి ఖంగుతిన్నారు. రిపేరు చేసిన మోటర్లు వైర్లు దొంగలించడంతో యజమానులు దిక్కు తోచక బోరున విలపించారు. జరిగిన విషయంపై బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గ్రావెల్ అక్రమ రవాణా

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలో యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ దందా కొనసాగుతుందని పలువురు పేర్కొంటున్నారు. జేసీబీల సాయంతో ట్రాక్టర్ల ద్వారా దర్జాగా ప్రభుత్వ సంపదను పట్టపగలే కొల్లగొడుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు తెలియజేసినా ఫలితం లేదని వాపోతున్నారు. నార్త్ మోపూరు కేంద్రంగా చేసుకొని అంతా తరలిస్తున్నారని లైసెన్సులు లేని డ్రైవర్లు అధిక స్పీడ్ తో ట్రాక్టర్లను నడపడంతో ప్రమాదాలు జరిగితే ఎవరిది బాధ్యత అంటూ విమర్శిస్తున్నారు. రాత్రి పగలు లేకుండా అక్రమ గ్రావెల్ తరలిస్తుంటే గ్రామస్తులు హెచ్చరించినా దోపిడీదారులు పట్టించుకోవడంలేదని తెలియజేశారు.

ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపునకు ప్రచారం

ప్రజాశక్తి-కొండాపురం : తూర్పు రాయలసీమ టిడిపి ఎంఎల్‌సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌కు మద్దతుగా కొండాపురం మండలం టిడిపి మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వేగటాద్రి నర్రానారాయణ, యరవ క్రినయ్య, పోలినేని రమేష్, నవీన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొండాపురం : దుర్మార్గ సిఎం జగన్మోహన్ రెడ్డిని దించాలంటే ఎంఎల్‌సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌ను గెలిపించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి మాజీ జెడ్‌పి చైర్మన్ చెంచల బాబు యాదవ్, రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి పెల్లుకూరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక చెంచలబాబు అతిథి గహంలో మండల నాయకులు క్లస్టర్ బూత్ లెవల్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులు చింతన బోయిన బయన్న, మైనార్టీ నాయకులు రియాజ్, మాజీ జెడ్పిటిసి కలవెల జ్యోతి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : తూర్పు రాయలసీమ శాసనమండలి వైసిపి అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జెసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆదిశేషయ్య శనివారం పలు ప్రయివేటు కాలేజీలు, పాఠశాలలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, యువనాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, నలిశెట్టి శీనయ్య, వెంకటరమణయ్య, సురేష్ యాదవ్, తదితరులున్నారు.

కంచర్ల శ్రీకాంత్ చౌదరిని గెలిపించండి

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : తూర్పు రాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ చౌదరికి ఓటు వేయాలని శనివారం నాయకులు 13వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తుమ్మల చంద్రా రెడ్డి, కేతా విజయ్ భాస్కర్ రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, తోడేటి వెంకటయ్య, బొగ్గవరపు శ్రీకాంత్ నారాయణ, ఉదయగిరి సుధాకర్, ఎస్‌కె కాజా మస్తాన్, పాలేటి శేషారెడ్డి, రాచూరి రమణయ్య, ఛీదర్ల మనోజ్, కోలా కృష్ణ, ఈసా జనార్ధన్, ఎదురు దీక్షత్, బొగ్గవరపు మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.


పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం



అనంతసాగరంలో...

ప్రజాశక్తి-అనంతసాగరం

తూర్పు రాయలసీమ శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వేంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలకు మొదటి ప్రాధన్యత ఓటు వేసి గెలిపించాలని శనివారం మండలంలో ప్రజా సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉప్పలపాడు, కమ్మవారిపల్లి, పడమటి కంభంపాడు, సోమశిల గ్రామాల్లో ఉన్న పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలిసి పిడిఎఫ్ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శాసన మండలిలో నిరుద్యోగ, చిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు వెట్టిచాకిరి విధానం రద్దు కోసం, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగాల కోసం, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరణ చేయాలని పోరాటం చేస్తున్న పిడిఎఫ్ తరుపున గెలిచిన ఎంఎల్‌సిలే అని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గ ఉద్యమాలకు, ప్రజా పోరాటాలకు అండగా నిలుస్తుందని తెలిపారు. పిడిఎఫ్ తరుపున పోటీ చేసే ఎంఎల్‌సి అభ్యర్థులను ఓటు కలిగిన పట్టభద్రులు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల పింఛనుదారుల సంఘం నాయకులు మనిప్రసాద్, శ్రీ రాములు, సుధకర్ రావు, వేము పెంచలయ్య, ఖాజా మొహిద్దీన్, యుటిఫ్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు రెడ్డి, యుటిఎఫ్ నాయకులు ఎంఎల్‌సి ఎన్నికల కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ ఎస్‌డి.వల్లి అహ్మద్, సిఐటియు మండల కార్యదర్శి అన్వర్‌బాషా, తదితర రిటైర్డ్ ఉద్యోగులు, పింఛన్‌దారులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం లోని వైకుంఠపురం అన్నపు గుంట, మసీదు, పెద్దపావని రోడ్డు, మంచాల వారివీధి, తదితర ప్రాంతాలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిం చాలని శనివారం డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెద్దల సభలో నిరుద్యోగులు, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్, ఉపాధ్యాయ, కార్మిక వర్గ, ప్రయివేట్ విద్యాసంస్థల లెక్చరర్ల, ఉపాధ్యాయుల, తరఫున ప్రశ్నించేది పిడిఎఫ్ అని తెలిపారు. పిడిఎఫ్ తరఫున పట్టభద్రుల నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వర రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా పోటీ చేస్తున్న పొక్కిరెడ్డి బాబురెడ్డికి కూడా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, బోగిశెట్టి కిష్టయ్య, జి.మధుసూదన్ రావు, డివైఎఫ్ఐ నాయకులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో...

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : శాసనమండలి ఎన్నికలలో పోటీ చేస్తున్న పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి వెంకటేశ్వర్లు రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి స్థానిక ప్రజా సంఘాల నాయకులు ఆత్మకూరు నాగయ్య, ఎం.నాగేంద్ర, అశోక్, ప్రకాష్ ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బుకు లొంగకుండా ప్రజా సమస్యల కోసం పోరాడే సాధించే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించినట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రయివేట్ పాఠశాల ఉపాధ్యాయులు అనేక రకాల ఉద్యోగుల సమస్యల కోసం శాసనమండలలో గళం విప్పి సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ సమస్యలపై నిరంతరం పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకొందామని ప్రజాసంఘాల నాయకులు కోరారు. శనివారం స్థానిక శ్రీనగర్ కాలనీ మంగళకట్ట సినిమాలు సెంటర్ సింగనపల్లి వీధిలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగ నిర్మూలన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ నిర్భయంగా సమస్యలపై గల విప్పే పిడిఎఫ్ ఎంఎల్‌సి పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లురెడ్డి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలను మొదటి ఓటు వేసి



గెలిపించుకోవాలన్నారు. ప్రజా సంఘాల నాయకులు కాకు.వెంకటయ్య, గడ్డం నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-నెల్లూరు : 13వ తేదీ జరుగుతున్న శాసనమండలి ఎన్నికల్లో ప్రజల తరపున మాట్లాడే పిడిఎఫ్ గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామంలో ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆలూరు తిరుపాలు, జానా లక్ష్మీ ప్రసాద్, బాలు ఆదిశేషయ్య, అచ్చి అనంతయ్య, పేరత్తూరు నాగరాజు, రామా బత్తిన శంకరయ్య, ఆరిద్దుల సీనయ్య పాల్గొన్నారు.



మర్రిపాడులో...

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక యుటిఎఫ్ భవన్‌లో త్వరలో జరుగనున్న ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా సిఐటియు మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా నాయకులు శివయ్య పాల్గొని ఎన్నికల గూర్చి పలు సూచనలు సలహాలిచ్చారు. అలాగే పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలిసి పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా అభ్యర్థించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి రత్నయ్య, భవన మండల కార్యదర్శి దండు జాన్సన్, పొంగూరు శాఖ కార్యదర్శి సిరంగి రమణయ్య, విద్యుత్ శాఖ సభ్యుడు శేషయ్య మధ్యాహ్నం భోజనం పథకం నాయకురాలు రాములమ్మ, ఆశా వర్కర్లు మండల అధ్యక్షులు కార్యదర్శులు కామాక్షమ్మ, భారతి, ఐద్వా సంఘం నాయకులు శ్యామలమ్మ, ప్రమీలమ్మ, ఖాసింబీ, తదితరులున్నారు.



వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా..

ప్రజాశక్తి-వరికుంటపాడు

ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అయితే ఓటర్లను ప్రభావితం నాయకుల పోస్టర్లను తొలగించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వరికుంటపాడు మండలంలోని ప్రభుత్వ హాస్పిటల్ గేటు ఎదురుగా రాజకీయ నాయకులు పోస్టర్లు దర్శనం ఇచ్చాయి. దీనికి ఎన్నికల కోడ్ వర్తించదా అని పలువురు చర్చించుకుంటున్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం కందుకూరు డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీకృష్ణమోహన్ పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం అనే పథకం ద్వారా ప్రతిఒక్క గ్రామం ప్రతి ఒక్క ఇల్లు పరిశుభ్రంగా ఉండాలని పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారికి జీతాలు ఇవ్వాలంటే కేవలం ప్రభుత్వం ఇచ్చే నిదులు వల్లే సరిపోవు కాబట్టి మన పంచాయతీ సొంత నిదులు ద్వారా గ్రామ అబివృద్ధికి దోహద పడుతుందన్నారు. ప్రతి ఒక్క కార్యదర్శి ఇంటి పన్నును 100శాతం వసూలు చెయ్యాలన్నారు. 65శాతం లోపు ఇంటి పన్ను వసూలు చేసిన నలుగురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు కూడా ఇస్తామని తెలిపారు. వరికుంటపాడు మండలం పరవాలేదు అని బాగానే ఇంటి పన్ను రుసుము కట్టించారన్నారు. అంతేకాకుండా చెత్త సంపద తయారీ కేంద్రాలు ఎక్కడైతే ఇంకా నిర్మాణంలో రాలేదని, అవి నిర్మాణంలోకి తీసుకురావడానికి పలు సూచనలిచ్చారు. వాటి నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీలోని ప్రజలు ఇంటి స్థలాలకు ఖాళీ ప్రదేశాలకు వారి వారికి హౌస్‌కార్డ్ ఇవ్వాలనే నిర్ణయంలో భాగంగా గత 50 సంవత్సరాలుగా తీసుకున్న చర్య ప్రస్తుత ప్రభుత్వం తీసుకుందన్నారు. పై మూడు అంశాలపై కార్యదర్శులకు పలు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బోధన చేస్తున్న ఎంఇఒ మస్తాన్‌వలీ

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రెండోదశ నాడు-నేడు పనులను పూర్తి చేయాలని మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్‌వలీ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎంపిపిఎస్ జి చెర్లోపల్లి, ఎంపిపిఎస్ వడ్డెపాలెం, ఎంపిపిఎస్ బిజ్జంపల్లి మెయిన్, జిల్లా ఉన్నత పాఠశాల బిజ్జంపల్లి పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బిజ్జంపల్లి పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు-నేడు రెండోదశలో మంజూరైన నూతన టాయిలెట్స్, అదనపు తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వం కొంతవరకు నిధులు మంజూరు చేసిన ప్రధానోపాధ్యాయులు టి.వెంకటేశ్వర్లు, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు కె.చంద్రశేఖర్ రెడ్డి, జి.వెంకటేశ్వర్లు తమ సొంత నిధులను పెట్టి అదనపు తరగతి గదులను స్లాబ్ వేయించినందుకు వారిని అభినందించారు. ఎంపిపిఎస్ జి చెర్లోపల్లి పాఠశాలలో మనబడి నాడు-నేడు మొదటిదశలో మంజూరైన వాటర్ ప్యూరిఫైర్‌ను పరిశీలించారు. అనంతరం గ్రీన్ చాక్‌బోర్డుపై విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరిశీలించి పాఠశాల రికార్డ్‌లను టాయిలెట్స్, మధ్యాహ్న భోజన విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండబిట్రగుంటకు ఆర్‌టిసి బస్సులు

ప్రజాశక్తి-కావలి

కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు ప్రకటనలో తెలిపారు. ఆది, సోమ, మంగళవారాల్లో 25 తిరునాళ్ల స్పెషల్ బస్సులు నడపడంతో పాటు కావలి, అల్లూరు, ముంగమూరు తోటలు, కొండబిట్రగుంటలలో సహాయకేంద్రాలు ఏర్పాటుచేసి, వాలంటీర్లను భక్తులకు అందుబాటులో ఉంచుతామని వివరించారు. కావున భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొండబిట్రగుంట తిరునాళ్లకు సురక్షితంగా, సౌకర్యావంతంగా ప్రయాణించాలని కోరారు.

చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి-మర్రిపాడు

చిరుధాన్యాలలో ఉన్న విశేష గుణాలను గుర్తించిన ఆహార శాస్త్రవేత్తలు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. చిరుధాన్యాల సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుపై కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం శిక్షణా కార్యక్రమం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.ఎల్.శివజ్యోతి మాట్లాడుతూ చిరుధాన్యాలైన కొర్రలు, సామలు, సజ్జలు, రాగులు, జొన్నలు, ఊదలు ఆరికెల సాగుపై మక్కువ పెంచాలన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉండడానికి చిరుధాన్యాలు ఎంతగానో ఉపయోగపడతాయని, నీటి వినియోగం తక్కువగా ఉండి పర్యావరణానికి ఎటువంటి హానీ జరగదన్నారు. ఈ శిక్షణతో మహిళలు ఆర్థికంగా మెరుగుపడటానికి మంచి అవకాశం ఉందని స్వయం ఉపాధి దిశగా నడవాలన్నారు. చిరుధాన్యాల పోషక విలువలను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ 2023వ సంవత్సరాన్ని ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్‌గా



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం


ప్రకటించి చిరుధాన్యాల ప్రాముఖ్యతను చాటి ఉత్పత్తి పెంచడానికి ప్రోత్సహిస్తుందని తెలిపారు. అతి తక్కువ పెట్టుబడితో పండించే మిల్లెట్స్‌తో అధిక ఆదాయం వచ్చే మార్గాలను పెంపొందించిం దన్నారు, చిరుధాన్యాల్లో ఇనుము, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు అధికమని, ప్రస్తుతం మార్కెట్లో ఉన్న డిమాండ్‌కు తగినట్లుగా రోజువారి ఆహారంలో చిరుధాన్యాల వినియోగాన్ని పెంచి మహిళలను ఉపాధి అవకాశాల దిశగా నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం, పెరుమాలపల్లి, ప్రధాన శాస్త్రవేత్త, డాక్టర్ వి.సుమతి ముఖ్య అతిథిగా పాల్గొని చిరుధాన్యాల సాగు విధానాలను వివరించారు. రైతులందరూ వీటిని కొద్ది పొలంలో సాగు చేసి రోజువారీ ఆహారంలో భాగంగా వినియోగించుకొని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకోవడంతో పాటు పర్యావరణ హితం, పౌష్టికాహార విలువలున్న ఈ చిరుధాన్యాల వంటి పంటలను రైతులు సాగుచేస్తే భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. చిరుధాన్యాల సాగులో పురుగులు, తెగుళ్ల యాజ మాన్యం గురించి సస్యరక్షణ గూర్చి వివరించారు. చిరుధాన్యాల సాగు విస్తృతి పెరగకపోవడం, డిమాండ్‌కు తగ్గట్లు వాటి లభ్యత లేకపోవడంతో ధరలు సామాన్యులు అందుకోలేకుండా పోతున్నారన్నారు. సజ్జలు, జొన్నలు, రాగులు, కొర్రలతో మిక్సిడ్ మిల్లెట్ లడ్డూలు, మురుకులు, చిరుధాన్యాల బిస్కెట్లు తయారీ విధానంపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పంటల ఉత్పత్తి విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయ్‌కుమార్‌నాయక్, విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.లోకేష్‌బాబు, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ సుజాత పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌పై పోలంరెడ్డి విమర్శ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ పెద్ద బూటకమని టిడిపి కోవూరు మాజీ శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాసనమండలిలో ప్రజావాణి టిడిపి ఎంఎల్‌ఎసి అభ్యర్థి డాక్టర్ కంచర్ల. శ్రీ కాంతుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ బూటకమని సూట్ కేస్ కంపెనీలతో డ్రామా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఐపాక్ ఉద్యోగులు సూటు బూటు వేసుకొని వచ్చి గిప్టులు భోజనం కోసం కొట్టుకోవడం ప్రపంచ వ్యాపారవేత్తల ముందు ఆంధ్రప్రదేశ్‌ను అవమానపరచినట్లు తెలిపారు. శాసనమండలిలో ప్రజావాణి కోసం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బలపరిచిన శ్రీకాంత్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు ఎం శ్రీనివాసులు రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు రవెళ్ల వీరేంద్ర చౌదరి, అధికార ప్రతినిధి చెముకుల కృష్ణచైతన్య, కార్యనిర్వాహక కార్యదర్శి చెంచు కిషోర్ యాదవ్, మైనార్టీ నేత ఎస్‌కె ఇంతియాజ్, మునగాల రంగారావు, కొండూరు సుధాకర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూ సమస్య పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి-సీతారామపురం

సీతారామపురం, గుండుపల్లి పంచాయతీల లోనీ పలు రైతులకు సంబంధించి భూ సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్ ఎం.శ్యామ్ సుందర్ రాజాకు రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పిసి. అల్లూరు రాజు వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు. ఆయనవెంట గుండుపల్లి పంచాయతీ వైసిపి నాయకుడు మాచిరాజు వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఊపందుకున్న ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-నెల్లూరు

ఎంఎల్‌సి ఎన్నికల తేదీ సమీపిస్తున్న తరుణంలో పోటీలో నిలిచిన అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. ప్రచార గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో అభ్యర్థుల కుటుంబ సభ్యులు సైతం ప్రచారంలో పాల్గొని తమవంతు పాత్ర పోషిస్తున్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపును ఆకంక్షిస్తూ ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలన్నా, చట్ట సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నా పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించాలని మద్దతు దారులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఇక ఎంఎల్‌సి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న అధికార పార్టీకి చెందిన వారు మరో అడుగు ముందుకు వేసి అసెంబ్లీ, పార్లమెంట్‌కు జరిగే ఎన్నికల్లో ప్రజలకు రాజకీయ నాయకులు తమ గెలుపుకోసం చేసిన హామీలకు ధీటుగా ఉద్యోగుల, ఉపాధ్యాయుల, కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామంటూ ఆర్భాటంగా హామీల వర్షం కురిపిస్తున్నారు. ఇక టిడిపి ఎంఎల్‌సి అభ్యర్థిని గెలిపించాలంటూ ఆ పార్టీ కార్యకర్తలు, మద్దతు దారులు చాపకింద నీరులా మూడో కంటికి కనిపించకుండా ప్రచారం చేసుకుంటూ ముందుకు సాగిపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో ప్రజలు తమ ఆగ్రహాన్ని నిరసన రూపంలో తెలియజేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలనలో జీతాలు సైతం సకాలంలో చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూన్నారని, ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానంటుతున్న తరుణంలో గ్యాస్ ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపడం సరికాదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూన్నారు. అంగన్‌వాడీ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని, అందులో భాగంగానే ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో కోత విధించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ అందజేయాలని డిమాండ్ చేస్తూ 20వ తేదీన విజయవాడలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మహాధర్నా కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు ప్రభుత్వం విధిగా ప్రయత్నం చేస్తుందని, ఆ ప్రయత్నానికి ధీటుగా అంగన్‌వాడీలు సమాధానం చెప్పి మహాధర్నాకు అధిక సంఖ్యలో హాజరు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. నగరంలో చోటు చేసుకుంటున్న వరుస హత్యలతో ప్రజలు తీవ్రభాయందోళనలకు గురవుతున్నారు. ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామ మహిళా సహకార బ్యాంకులో భారీగా అవినీతి చోటు చేసుకుంది. సహకార బ్యాంకులో కోట్లలో అవినీతి చోటు చేసుకుంటే ఈ వ్యవహారాన్ని బయటకు రాకుండా అడ్డుకొనేందుకు రాజకీయ శక్తులు కృషి చేస్తున్నాయి. పాలక వర్గంలో వైసిపి, టిడిపిలకు చెందిన నాయకుల సతీమణులుండటంతో ఎవరికి వారు తమ సతీమణులను కాపాడుకొనేందుకు శక్తి మేరకు కృషి చేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం నిజాయితీగా విచారణ చేపట్టి ఈ అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వీక్షణం

ట్రిబ్యునల్ తరలింపుపై హర్షం

ప్రజాశక్తి-ఉదయగిరి



హైదరాబాద్ నుండి కర్నూలుకు వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్ తరలించడంపై గడియాల్చి ఎస్థాని కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక మాట్లాడుతూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ ట్రిబ్యునల్ చైర్మన్‌ను నియమించడంతో వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన ఆస్తుల విషయంలో న్యాయం జరుగుతుందన్నారు. వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్ చైర్మన్ జి.భూపాల్రెడ్డిని నియమించడంతో పాటు హైదరాబాద్ నుంచి కర్నూలుకు తరలించడం కోసం ఉత్తర్వులు జారీచేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్ బాషాకు ఎస్థాని కృతజ్ఞతలు తెలిపారు.